విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 01, ఏప్రిల్ 2025

దాహం.. దాహం

- ఆదుకోని ప్రభుత్వ బోర్లు..
- ప్రైవేట్ బోర్ల వద్దకు ప్రజల పరుగు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని మీర్జాపురం గ్రామంలో తాగునీటి ఎద్దడితో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చుతుండడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామస్తుల తాగునీటి కోసం కలవటాల గ్రామ పరిధిలోని ప్రభుత్వ బోరు, అవుకు రిజర్వాయర్ నుండి తాగునీటి పథకం ఉన్నప్పటికీ ఏమాత్రం సరిపోవడం లేదు. దాహార్తి తీర్చడం కోసం గ్రామంలోని కొందరు దాతలు ప్రైవేటు బోర్ల ను ఏర్పాటుచేసి తాగునీటిని అందిస్తున్నారు. ప్రభుత్వ బోర్ల నుండి సరఫరా అవుతున్న నీరు గ్రామంలోని కొన్ని కాలనీలకు మాత్రమే సరిపోతుండటంతో మిగిలిన ప్రజలు మాత్రం ప్రైవేటు బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఉన్నప్పటికీ వాటి ద్వారా సరఫరా లేకపోవడంతో మహిళలు, యువకులు ప్రైవేటు బోర్ల వద్దకు త్రాగునీటిని తెచ్చుకునేందుకు ప్రత్యేకంగా తయారు చేయించుకున్న దొబ్బుడు బండ్లతో త్రాగునీటిని తెచ్చుకుంటూ ఇబ్బంది పడుతున్నారు. కొందరు మహిళలు పనులకు వెళ్లలేక త్రాగు నీటి కోసమే సమయాన్ని వెచ్చించవలసి వస్తున్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పవిత్ర రంజాన్ మాసం సందర్భం గా నంద్యాలలో ఈదుల్ ఫితర్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణం లోని పలు ఈద్గాలలో ముస్లిం సోద రులు ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థ నలు నిర్వహించారు. నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని భీమవరం రహదా రిలో ఉన్న అల్ ఫుర్ కాన్ ఈద్గా, వైఎస్సార్ బీసీ రహదారిలోని తోయ్యిబా ఈద్గాతో పాటు బొమ్మలసత్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన ఉన్న ఈద్గా, తిక్కస్వామి దర్గా దగ్గర ఉన్న ఈద్గాలలో పట్టణంలోని ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ఈద్గాలలో ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు. మత పెద్దలు అబ్దుల్ హాది, మౌలానా రఫీ, మౌలానా అంజాద్ బాషా సిద్దికి, మౌలానా మహబూబ్ బాషాలు రంజాన్ మాసం విశిష్టత, ఉపవాసాల ప్రత్యేకత గురించి వివరించారు. ప్రత్యేక ప్రార్థనలో రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, ఎపిపిఎస్సీ మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి నౌమాన్, టిడిపి పట్టణ అధ్యక్షుడు మనియార్ ఖాలీల్, కౌన్సిలర్లు ఆరిఫ్ నాయక్, సమద్, మాబువలితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. రాజకీయాలకతీతంగా ముస్లిం సోదరులను అలింగనం చేసుకొని ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పూర్ణాహుతితో ముగిసిన మహోత్సవాలు

విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైలం మహా క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు పూర్ణహుతితో సోమవారం ముగిశాయి. సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అనంతరం యాగశాలలో పూర్ణాహుతి ద్రవ్యాలను యజ్ఞగుండంలో ఆహుతిగా సమర్పించి, పూర్ణాహుతి కార్యక్రమాలను అర్చక స్వాములు శాస్త్రాను సారంగా నిర్వహించారు. అనంతరం చండీశ్వరునికి ప్రత్యేక పూజలు పుష్కరంలో అవబృదము త్రిశూల స్థానం కార్యక్రమంలో అర్చక స్వాములు నిర్వహించారు. సాయంకాలం ప్రత్యేక పూజలతో ఉగాది మహోత్సవాలు పూర్తిగా ముగిశాయి.

ఏపీలో రిజిస్ట్రేషన్ శాఖలో కీలక మార్పులు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వము, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ, కర్నూలు వారి ఉత్తర్వుల మేరకు ఈ నెల రెండో తేదీ నుండి నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యలయం నందు దస్తావేజు స్వీకరణ కొరకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన స్లాట్ బుకింగ్ ద్వారా ఇక నుంచి రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిరీక్షించే అవసరం లేకుండా ముందుస్తుగా స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనుందని నంద్యాల సబ్ రిజిష్టార్ తెలిపారు. మొన్నటి వరకు భూముల రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే గంటల తరబడి వెయిటింగ్ చేయాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడు వెయిటింగ్ చేయకుండా రిజిస్ట్రేషన్ సమయానికి వెళ్తే సరిపోతుందని, వారు కోరుకున్న తేదీ, సమయం నమోదు చేసుకొని ప్రజలు వారి దస్తావేజులను క్యూ లైన్ నందు గంటల తరబడి వేచి చూడకుండా సులభతరమైన రిజిస్ట్రేషన్ నంద్యాల రిజిస్ట్రార్ ఆఫీసు నందు రిజిస్టర్ చేసుకోవలసిందని తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఈ సదుపాయం అమల్లోకి రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసిన మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాలలోని వేలాది నిరుపేద ముస్లిం కుటుం బాలకు రంజాన్ తోఫా కిట్లను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పంపిణీ చేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని, నంద్యాల నియోజక వర్గంలోని వేలాది నిరుపేద ముస్లిం కుటుంబాలకు స్థానిక టీడీపీ కార్యా లయం రాజ్ టాకీస్ నందు మంత్రి తన సొంత నిధులతో తోఫా కిట్లను అందజేసి, మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. గోస్పాడు, నంద్యాల పరిధిలోని ముస్లిం కుటుంబాలకు తోఫాను అందజేశారు.

కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది: మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణ ముస్లిం మైనార్టీ సోదరులు రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఇందిరా రెడ్డి దంపతులను, మాజీ సర్పంచ్ బీసీ రాజా రెడ్డి, బీసీ రామనాథరెడ్డిని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీ సోదరులకు ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నియోజవర్గ అధ్యక్షుడు రాయలసీమ సలాం, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, పట్టణ అధ్యక్షుడు కాశీం బాబు, వార్డు మెంబర్లు అత్తర్ కలాం, అల్తాఫ్, నియాజ్, షాకీర్, అల్లా ప్రకాష్ ముస్లిం మైనార్టీ సోదరులు పెద్ద సంఖ్య పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి పూజలు

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : తెలుగు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా శ్రీ అభయ ఆంజనేయ స్వామికి శ్రీ సీతారామచంద్రమూర్తికి అభిషేకం అలంకరణ పంచామృత అభిషేకం కుంకుమ సింధూర అర్చనలు ఆకు పూజలు జరిగాయి. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి ప్రసాద వితరణ చేయడం జరిగింది. జంబులదిన్నె గ్రామ భక్తులు, చుట్టుప్రక్కల గ్రామాల సుద్ద పల్లె, పెద్దముడియం, బలపన గూడూరు, పెద్దయమ్మనూరు నుండి కూడా భక్తులు వచ్చి స్వామి వారి దర్శనం చేసుకుని అర్చనలు అభిషేకాలు పూజలు చేయించుకుని వెళ్ళడం జరిగింది. ఆలయ అర్చకులు మీ కీర్తి లక్ష్మణ స్వామి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని భగవంతుని ప్రార్థించడం జరిగింది.

జిల్లా అభివృద్ధి పథంలో ముందుండాలి : మంత్రులు

- వైభోవపేతంగా శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు
- జిల్లా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డిలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రాష్ట్ర ముఖ్యమంత్రి స్ఫూర్తితో జిల్లా అధికార యంత్రాంగం కష్టపడి సమన్వయంతో పని చేస్తే భవిష్యత్తులో నంద్యాల జిల్లా అభివృద్ధి పథంలో రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉంటుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ లు అన్నారు. కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మంత్రులతో పాటు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, ఉన్నతాధికారులు ఉగాది ఉత్సవాలను పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజాధి కార్యక్రమాలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం పంచాంగ శ్రవణ కర్తలు ప్రవీణ్ కుమార్ శర్మ, శివకుమార్ శర్మల వారి ఉగాది పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని ఆస్వాదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారుల ప్రదర్శించిన నృత్యాలను తిలకించి కొనియాడారు. ఈ వేడుకల్లో డిఆర్ఓ రాము నాయక్, ఆర్డిఓ విశ్వనాథ్, అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవ భావం కలిగి ఉండాలి

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: ప్రతి వ్యక్తి సమాజం లో సేవా భావం కలిగి ఉండాలని ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకుని స్థానిక కార్యాలయం నందు రంజాన్ వేడుకలను ఈఎస్ రవికుమార్ ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహించారు. అజరుత్ మౌలానా, జమాల్ రహమాన్, మౌలానా నౌమాన్ లు రంజాన్ పండుగ సందర్భంగా పవిత్రమైన సందేశాలు వివరించారు. బ్రహ్మయ్య, రమేష్ బాబు,అఖిల ఎస్ఐ ఎస్ అన్సర్ బాష, ఓబులేసు, రమణ, ప్రసన్న, ప్రకాష్, పార్వతి, శాలిశా, కలిల్, భరత్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర -అవుకు: ముస్లింలు పరమ పవిత్రంగా జరుపుకునే రంజాన్ పర్వ దినం వేడుకలను మండలం లోని ముస్లింలు సోమవారం అత్యంత భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామాలలో అన్ని మసీదులు, ఈద్గాల్లో సామూహిక ప్రార్ధనలు నిర్వహించారు. సామూహిక ప్రార్థనలతో మసీదులు, ఈద్గాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.

విశాలాంధ్ర - రుద్రవరం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు సోమవారం జరుపుకున్నారు. అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం లో నెల రోజుల పాటు ఉపవాస ప్రార్థనలు చేస్తూ ఐదు పూటల నవాజ్ చేసుకుంటూ, ఖురాన్ పఠణం చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో గడిపి నెలవంక కనబడుట వలన ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎమ్మెల్యే దంపతులకు ఘణ సన్మానం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రానికి చెందినటువంటి కేసీ కెనాల్ టీసీ మెంబర్ ఫ్రూట్ మార్కెటింగ్ మేనేజర్ కొత్తపేట బ్రదర్స్ ఆళ్లగడ్డ ఎమ్మెల్యేల భూమా అఖిలప్రియ, భార్గవ్ రాముల దంపతులను ఘనంగా సన్మానం చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా కొత్తపేట బ్రదర్స్ ఆహ్వానం మేరకు విందుకు హాజరైన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవ్ రామ్ దంపతుల చేత రంజాన్ కేక్ కట్ చేసి ఆత్మీయ బంధం మిత్రులకు ఇచ్చి పెట్టారు.పవిత్ర రంజాన్ మాసంలో నియమ నిష్ఠలతో క్రమశిక్షణతో ఉపవాసం ఎంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన కొత్తపేట ప్రదర్శన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అభినందించారు. అనంతరం భూమా దంపతులకు పట్టు శాలు కప్పి పూలమాల ఘన సన్మానం చేసి కొత్తపేట బ్రదర్స్ అభిమానాన్ని చాటుకున్నారు

వక్స్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లీముల నిరసన



విశాలాంధ్ర - వెలుగోడు : వక్స్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా వెలుగోడులో సోమవారం ముస్లీములు నిరసన వ్యక్తం చేశారు. ఈద్ నమాజ్ తరువాత వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పొట్టి శ్రీరాములు సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ చేసిన నాయకులు

విశాలాంధ్ర - నందికొట్కూరు: వైసీపీ రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాలతో నంది కొట్కూరు పట్టణంలోని మారుతి నగర్‌లో 50 మంది ముస్లిం, మైనారిటీ మహిళలకు సోమవారం మారుతి నగర్ వైఎస్ఆర్సిపి నాయకులు చరణ్ తేజ్ చీరలు పంపిణీ చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో పవిత్రమైన రంజాన్ పర్వదిన సందర్భంగా ముస్లిం సహోదర సహోదరీలు అందరూ కూడా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ అల్లాహ్ ఆశీర్వాదాలు ఎల్లప్పుడు తోడుగా ఉండాలని కోరుకుంటూ 50 మంది ముస్లిం మరియు మైనార్టీ మహిళలకు చీరల పంపిణీ చేయడం ఆ దేవుని కృపవలన జరిగిందని చరణ్ తేజ అన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి నగర్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, పెయింటర్ మహబూబ్ బాష, బాబు, ప్రకాశం, రెహమాన్, శశాంక్, అరుణ్, రియాజ్, లాజర్, ముస్లిం, మైనారిటీ మహిళలు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర స్వామికి పల్లకి సేవ

విశాలాంధ్ర - బనగాన పల్లె: మండల పరిధిలోని యాగంటి శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవ స్థానం నందు సోమవారం సందర్భముగా ఉమా మహేశ్వర స్వామికి పల్లకి సేవ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం నందు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేష్ రెడ్డి, యాగంటిపల్లె ఉప ఉప సర్పంచ్ మౌళీశ్వర రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డలో రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులు ఫిత్రా, జకాత్ ను ఆచరించి ప్రార్ధనలకు వెళ్లారు. పట్టణంలోని మసీదులు, దివ్య జ్ఞాన మందిరం నుంచి ముస్లింలు తక్బీర్ చదువుకుంటూ లింగందిన్నె రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీ, మత పెద్ద మహమ్మద్ సాదిక్ రంజాన్ పండుగ గొప్పతనాన్ని వివరించారు.

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : ముస్లింలు రంజాన్ పర్వదినం వేడుకలను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించు కున్నారు. రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు ఉపవాస దీక్షల అనంతరం వచ్చే రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆ లింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కోవెలకుంట్ల పట్టణంతోపాటు, రేవనూరు, అమడాల, సౌదరదిన్నె, పెద్ద కొప్పెర్ల, చిన్నకోపెర్ల, కలుగోట్ల తదితర గ్రామాల్లో ప్రజలు ఈద్గాలకు వెళ్లి ప్రార్థన నిర్వహించారు.

ఎమ్మెల్యేకు ఈద్ ముబారక్ తెలిపిన షబానా

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: రంజాన్ పర్వ దినాన్ని పురస్కరించుకొని ఆత్మకూరు పట్టణంలో ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే వేడుకల్లో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. నమాజ్ అనంతరం బీజేపీ నాయకురాలు మోమిన్ షబానా ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లీంల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

భక్తి శ్రద్ధలతో ఈద్‌ఉల్ పితర్ వేడుకలు

విశాలాంధ్ర - బనగానపల్లె: ముస్లింలు పరమ పవిత్రంగా జరుపు కునే రంజాన్ పర్వదినం వేడు కలను బనగాన పల్లెలో ముస్లిం లు సోమవారం అత్యంత భక్తిశ్రద్దలతో ఘనంగా జరిపారు. పట్టణం లోని అన్ని మసీదులు, ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. సామూహిక ప్రార్థనలతో మసీదులు, ఈద్గాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ప్రార్థనల అనంతరం పేద,ధనిక తారతమ్యం లేకుండా సహృదయ, సద్భావనాలతో ప్రతి ఒక్కరు ఆలింగనం చేసుకుని ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మసీదులో, ఈద్గాల వద్ద జరిగిన ప్రార్థనల్లో మతపెద్దలు, హిందూ, ముస్లిం సోదరులు ప్రతి ఒక్కరు మతసామరస్యాన్ని కాపాడుతూ అన్నదమ్ములవలె కలిసిమెలిసి ఉండాలని తమ సందేశాన్ని ఇచ్చారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర - చాగలమర్రి: రంజాన్ పండగను ముస్లింలు మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. నూతన దుస్తులు ధరించి చిన్నా, పెద్దా తేడా లేకుండా ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలింగనం చేసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద ప్రభుత్వ ఖాజీ ముల్లా యూనస్ ప్రార్థనలు చేయించి రంజాన్ ప్రాముఖ్యత గురించి వివరించారు.

ముస్లీం సోదరులకు రంజాన్ తెలిపిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: రంజాన్ పర్వదినం పురస్కరించు కొని ముస్లిం సోదరులు నెలరోజుల పాటు ఉపవాస ప్రార్థనలు చేపట్టి ఘనంగా రంజాన్ పండుగను నిర్వహించడం జరిగింది. కొత్తపేట మసీదులో ప్రార్థనలో నిర్వహించుకుని, కబురస్థాన్లో తమ పెద్దలను స్మరించుకుంటూరు. పట్టణంలో నంద్యాల టర్నింగ్ లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ముస్లిం సోదరులను కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజెశారు. ముస్లిం సోదరులందరూ ఒకరిని ఒకరు అలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వీరి వెంట టీడిపి నాయకులు యుగంధర్ రెడ్డి, అబ్దుల్లాపురం భాష, శాలి పైల్వాన్, నూరుబేగ్, ముస్లిం మైనార్టీ సోదరులు, మత పెద్దలు పాల్గొన్నారు.

కుల వృత్తుల వారిని విశ్వకర్మ పథకంలో చేర్చాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: స్థానిక బీజేపీ కార్యాల యంలో అసెంబ్లీ కన్వీనర్ బివి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ బివి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు సాధించిన ఘన విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి గ్రామంలో అంత్యోదయ కార్యకర్తలను కుల వృత్తుల వారీగా ఉన్నటువంటి అందరిని విశ్వకర్మ పథకంలో చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాదగిరి ఇతర మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలంధ్ర- జూపాడు బంగ్లా: రంజాన్ పండుగ పురస్కరించు కొని ముస్లిం సోదరులు కుటుంబ సమేతంగా భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని తరిగొప్పుల, జూపాడు బంగ్లా, తుడిచెర్ల, పోతులపాడు, పారుమంచాల, తాటిపాడు, తంగడంచ, తర్తూరు, మల్లెం, బన్నూరు గ్రామాలలో ఈద్ ఆల్ ఫిథర్ పర్వదినం రంజాన్ పండుగ సందర్భంగా మసీదులు దర్గాలలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థన చేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

సమరం... సంబరం..

- కైరుప్పలలో అంతింతైన పిడకల సమరం
- దశాబ్దాలుగా కొనసాగుతున్న సాంప్రదాయ సంబరం
- ఉత్కంఠ భరితంగా సాగిన సమరం
- సుమారు 30 మందికి గాయాలు

విశాలాంధ్ర ఆస్పరి: దశాబ్దాలుగా కొనసాగుతున్న సాంప్రదాయం గ్రామానికి పెద్ద సంబరం. గ్రామస్తులు రెండుగా విడిపోయి పిడకలతో తలపడటం ఆ తరువాత అందరూ కలిసిపోయి, ఆనందాన్ని పంచుకోవడం మండలంలోని కైరుప్పల గ్రామ ప్రత్యేకత. శ్రీ వీరభద్ర స్వామి కాళికాదేవి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన పిడికల సమరం వేలాదిమంది భక్త జన సమూహం మధ్య ఉత్కంఠ భరితంగా సాగింది. అరగంట పాటు సాగిన పిడకల సమరం చివరికి ప్రశాంతంగా ముగిసింది. ఈ ఉత్సవ సమరాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి వేలాదిగా జనం తరలివచ్చారు. ప్రేమ వ్యవహారంలో వీరభద్రస్వామి, కాళికాదేవి కుటుంబాల మధ్య ఏర్పడిన విభేదాలతో గ్రామస్తులు రెండు గ్రూపులుగా విడిపోయి పిడకలతో దాడి చేసుకోవడానికి కారణమైందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ పిడకల సమరంలో ముందుగా ఆనవాయితీగా కారుమంచి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వంశస్థులు నందా కిషోర్ రెడ్డి కారుమంచి గ్రామం నుంచి కైరుప్పల గ్రామంలోకి మంది మార్బలంతో తప్పేట్లు, మేళా తాళాలు, మంగళ వాయిద్యాల మధ్య శ్రీ వీరభద్ర స్వామి ఆలయానికి సాయంత్రం చేరుకున్నారు. దేవాలయంలోనే వీరభద్రాస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి వెనక్కి తిరగగానే పిడకల సమరం మొదలైంది. గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం పిడకలతో దాడి చేసుకున్నారు. తమను తాము రక్షించుకుంటూ ఎదుటివారిపై పిడకలు విసురుతూ గుంపులు గుంపులుగా కదిలారు. తమ వర్గం వారు గెలవాలనే తపనతో అక్కడ ఉన్న పిడకలు అయిపోయేంత వరకు ఈ సమరం సాగింది. సుమారుగా 30 మందికి పైగా గాయపడ్డారు. దెబ్బలు తగిలిన వారు స్వామివారి బండారు గాయాలకు పూసుకున్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. వేలాది మంది జనం మధ్య కైరుప్పల గ్రామం కిటికీటలాడింది. పిడకల సమరం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పత్తికొండ డిఎస్పి వెంకటరామయ్య, ఆస్పరి, ఆలూరు సిఐలు మస్తాన్ వలి, రవి శంకర్ రెడ్డి, చిప్పగిరి తుగ్గలి ఎస్సైలు సతీష్, కృష్ణమూర్తిలతో పాటు యాభై మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చోలే ఓంకారి, అర్చకులు వీరేష్ స్వామి, సర్పంచ్ కాసారం తిమ్మక్క, ఎంపీటీసీ లక్ష్మీ, ఈవో రాంప్రసాద్, సాగు నీటి సంఘం చైర్మన్ బసవరాజు, మాజీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ బీటెక్ బద్రి, లక్ష్మన్న, కుక్కల రంగన్న, మాజీ డైరెక్టర్ ఉరుకుందు, మాజీ ఎంపీటీసీ రవీంద్ర, అంగడి వీరేష్, రేవంత్ స్వామి బంత్రోతు శ్రీను, మెడికల్ వీరేష్, సర్పంచ్ వెంకటేష్, మారెన్న, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి : మంత్రి టీజీ భరత్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ముస్లిమ్ సోదరుల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా నగరం లోని పాత ఈద్గాలో జిల్లా కలెక్టర్, ముస్లిం సోదరులతో కలిసి మంత్రి టీజీ భరత్ ప్రార్థనలు చేశారు. అనంతరం మంత్రి, కలెక్టర్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముస్లిం సోదరులందరూ ఎంతో పవిత్రతతో, భక్తి శ్రద్ధలతో, ఆనందంగా జరుపుకుంటున్న పండుగ రంజాన్ అన్నారు. వర్షాలు బాగా కురిసి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా ఉండేలా దీవించాలని అల్లాహ్ ను ప్రార్థించానని మంత్రి తెలిపారు. ఉగాది, నేడు రంజాన్ పండుగలు రావడం సంతోషం అని, కర్నూలు నగరంలో కుల, మతాలకు అతీతంగా అందరూ అన్ని పండుగలను జరుపు కోవడం ఆనవాయితీ అని మంత్రి అన్నారు.

త్యాగానికి ప్రతీక రంజాన్ - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా : త్యాగానికి ప్రతీక రంజాన్ అని, రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు క్రమశిక్షణ, ధార్మిక చింతన, నియమ నిష్టలతో నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో అల్లాహ్‌ను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగి స్తారనిజిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. సోమవారం రంజాన్ పండుగ జరుపుకుంటున్న సందర్భంగా జిల్లా ప్రజలందరికి కలెక్టర్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నందవరం: స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రచార జీపు జాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతుల పరిస్థితి బాగాలేదని, వ్యవసాయం గిట్టుబాటు కాక పట్టణ ప్రాంతాలకు వలసలు పోతున్నారని, వ్యవసాయం మీద చేసుకున్న అప్పులు కొండంత భారమై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 4న జాతీయ రైతు సదస్సును చేపడుతున్నామని, సదస్సుకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి గిడ్డయ్య, తాలూక రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు అధ్యక్ష, కార్యదర్శులు మాలిక్, శాంతప్ప, ముని, నరసప్ప, భీమన్న, షద్రక్, పాండు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కళారత్న పత్తి ఓబులయ్యను అభినందించిన మాజీ ఎంపీ

విశాలాంధ్ర - కర్నూలు: విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నాటక రంగ విభాగంలో కళారత్న అవార్డును పొందిన టీజీవి కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యను, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ సోమవారం అభినందనలు తెలిపారు. టీజీవి కళాక్షేత్రం నాటక రంగానికి ఎన్నో సేవలు అందిస్తుందని ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ అన్నారు. పత్తి ఓబులయ్య సేవలకు గుర్తింపుగా ముఖ్యమంత్రి కళారత్న బిరుదుతో పాటు హంస అవార్డు అందించారన్నారు. పత్తి ఓబులయ్య భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని టీజీ కోరారు. టీజీవి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు వివి రమణా రెడ్డి, రాజశేఖర్, రాజారత్నం, కృష్ణ, శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, పార్వతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: మాసం రోజుల నుండి ఉపవాసం ఉండి ఆదివారం నెలవంక కనిపించడంతో రంజాన్ పండుగను ముస్లీం జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కర్నూలు పట్టణంలో కొత్తబస్టాండ్ సమీపంలోని ఈద్గా వద్ద నగరంలోని ముస్లీంలు హాజరై ప్రార్థనలు నిర్వహించుకున్నారు. నగరంలో పలు చోట్ల జరిగిన ఈప్రార్థనలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష, మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, వైసీపీ నాయకులు ఇంతియాజ్‌బాష, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. జిల్లాలో పలు చోట్ల ఎమ్మెల్యేలు నాయకులు పాల్గొని ప్రార్థనలు చేసి ఈద్‌ముబారక్ తెలిపారు. పేదలకు సహాయం చేశారు. రంజాన్ సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యగా జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు ప్రార్థనా మందినాలు, ఈద్గా వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కర్నూలు నగరంలో కొత్తబస్టాంక్ వచ్చే బస్సులను నగరంలో నుండి కాకుండా గుత్తి పెట్రోల్ బంక్ మీదుగా బళ్ళారి చౌరస్తా మీదుగా కొత్తబస్టాండ్ మళ్లించారు.

హంద్రీనదిని పరిశీలించిన వామపక్ష నాయకులు

విశాలాంధ్ర - కోడుమూరు: వేసవి కాలం దృష్ట్యా పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై వామపక్షాలు హంద్రీనదిని పరిశీలన చేశారు. ప్రతియేటా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై స్పందించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, మండల కార్యదర్శి బి.రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మద్దూరు చిన్నరాముడు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ నాయకులు గఫూర్మియా, మండల కార్యదర్శి కె.రాజు, సీఐటీయూ మండల కార్యదర్శి బజ్జీల వీరన్నలు హంద్రీనదిలోని తాగునీటి వనరులను పరిశీలన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేసవికాలం వచ్చిన ప్రతిసారి పట్టణ ప్రజలకు తీవ్రమైన తాగునీటి సమస్య నెలకొంటుందని, తాగునీటి సమస్యపై ఏ పాలక ప్రభుత్వాలు పని చేయలేదని విమర్శించారు. హంద్రీ మొత్తం జమ్ముతో నిండిపోయి ఎడారిగా మారిందని, తాగునీటి వనరులపై ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడం చాలా బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా కోడుమూరు పట్టణానికి త్రాగునీటిపై ప్రజలు ప్రజాసంఘాలు,కుల సంఘాలు, వామపక్షాలు, అన్ని పార్టీల నాయకులు కలిసి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా ప్రభుత్వ అధికారులకు చీమకుట్టినట్లుగా లేదని తెలిపారు. ఈ విషయంలో అధికారులు, పాలక ప్రభుత్వ పెద్దలు కోడుమూరుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు తోపాటు అతి దగ్గరలో ఉన్న గాజులదీన్నె ప్రాజెక్టు నుంచి పైప్ లైన్ ద్వారా తాగునీరు అందించాలని కోరారు.

డీఎస్పీకి సన్మానం

విశాలాంధ్ర-హొళగుంద: రంజాన్ పండుగ సోమవారం ఘనంగా జరిగింది. రంజాన్ పండుగకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పత్తికొండ డిఎస్‌పి వెంకట్రామయ్య, సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్సై దిలీప్ కుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రంజాన్ పండుగతో పాటు ఉగాది పండుగ, గ్రామంలోని రథోత్సవాలు ప్రశాంతంగా జరిగినందుకు మండల టిడిపి కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, టిడిపి నాయకులు తోక వెంకటేష్, బాగోడి రాములు డీఎస్పీ మరియు సిఐ, ఎస్ఐలకు పోలీస్ స్టేషన్లో శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయండి : పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: ఈ నెల 4న కర్నూలులో జరిగే జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో జాతీయ రైతు సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పి.రామచంద్రయ్య మాట్లాడుతూ దేశానికి అన్న వస్త్రాలను అందించే రైతును రక్షించాలంటే వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పార్లమెంటులో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు నెలకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి పి.భీమ లింగప్ప, మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, మద్దికేర మండల కార్యదర్శి నాగరాజు, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి సురేంద్ర కుమార్, సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు గురుదాస్, కారన్న, పెద్ద ఈరన్న, నెట్టికంటయ్య, ఉరుకుందు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక ఆధారంగా నేరాలపై నిఘా : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సాంకేతిక ఆధారంగా నేరాల కట్టడిపై దృష్టి పెట్టామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ సంధర్భంగా సోమవారం రాష్ట్ర డిజిపి ఆఫీసు నుండి కర్నూలు జిల్లా పోలీసు శాఖకు కేటాయించనున్న డ్రోన్ కెమెరా పనితీరును కర్నూలు ఎపిఎస్పి 2వ బెటాలియన్‌లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని స్మార్ట్ పోలీసింగ్‌తో నేరాలను నియంత్రించడానికి డ్రోన్ సాంకేతికతను ఉపయోగించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రోన్ కెమెరా గురించి ఈ డ్రోన్ కెమెరా చెన్నై మార్స్ ఎయిరో ప్రవేట్ లిమిటెడ్‌కు చెందిదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, విపత్తు నిర్వహణ, వివిధ బందోబస్తులు, బహిరంగ సభలు, జాతరలు, ఊరేగింపు సమయంలో జన సమూహాన్ని పర్యవేక్షించడం, క్రౌడ్ మేనేజ్మెంట్ ద్వారా అవాంఛనీయ సంఘటనలు నిలువరించుట, సెన్సిటివ్, హాట్స్పాట్ ప్రాంతాల్లో గస్తీ నిర్వహించుటకు, వరదలు, భూకంపాల వంటి విపత్తు సమయాలలో రెస్క్యూ సహాయక చర్యలు చేపట్టుట, అనుమానితులను గుర్తించడం, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, పండుగలు, ఉత్సవాలు, కర్ఫ్యూలు, అత్యవసర సమయాలలో 5 కిలోమీటర్ల వరకు ఈ డ్రోన్ ప్రయాణించగలదు. నాటుసారా తయారీ, పేకాట స్థావరాలు, బహిరంగ, పబ్లిక్ ప్రదేశాల్లో అనుమానితులను, నగర శివారులలో చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై, రాత్రి సమయాల్లో వాహనాల నెంబర్లను నైట్ విజన్ కెమెరాతో పర్యవేక్షిస్తుంది. వరదలు, రెస్క్యూ సమయాలలో పేలోడ్ టెక్నాలజీతో బాధితులకు సహాయం అందించడానికి 5 కేజీల ఫుడ్, లేదా మెడికల్ వస్తువులు తీసుకెళ్ళగలదు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్పి 2వ బెటాలియన్ డిస్పీ రమణ, స్పెషల్ బ్రాంచ్ సిఐ తేజమూర్తి, కర్నూలు నాల్గవ పట్టణ సిఐ మధుసుధన్ గౌడ్ ఇతర అధికారులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర - ఆస్పరి: ఆస్పరి మండలం లోని కైరుప్పల గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా శ్రీ వీరభద్ర, కాళికాదేవిల బ్రహ్మోత్స వాలను పురస్కరించుకొని బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యం లో భక్తులు, ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. సోమవారం బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, గ్రామ పెద్ద గుళ్లో వీరేష్ స్వామిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలతో పాటు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన వెంకటేశ్వర్లు సేవా సమితి సభ్యులను అభినందిస్తున్నట్లు చెప్పారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు సుదూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే దేవాలయానికి వచ్చే భక్తులు, ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు సేవాసమితి కార్యదర్శి విరుపాక్షి, రమేష్, గ్రామ నాయకులు వీరేషు, గోపాలు, శ్రీనివాసులు, ఉరుకుందు, రంగేష్, రామాంజనేయ, వెంకటేశు, పూజారి మహేష్, ధనంజయ, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

విశాలాంధ్ర ఓర్వకల్లు : హిందూ పురాణాల ప్రకారం, దానాల్లో ఉత్తమమైన దానం అన్నదానమని పెద్దలు చెబుతారు. ఒకపూట భోజనం పెట్టి ఆకలితో ఉన్న వారి కడుపు నింపొచ్చు. ఇలా ఇతరుల కడుపు నింపడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని చాలా మంది నమ్ముతారు. మండల పరిధిలోని నన్నూరు గ్రామ ప్రజలు శివ భక్తుల ఆధ్వర్యంలో లొద్దిపల్లె, పూడిచెర్ల, బైరాపురం ఉయ్యాలవాడ తదితర గ్రామ ప్రజల భక్తుల సహాయ సహకారాలతో కన్నడిగులకు సోమవారం అన్నదానం నిర్వహించారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునుల దర్శనానంతరం కన్నడిగులు మహానంది, యాగంటి, ఓంకారం క్షేత్రాలను దర్శించుకుంటూ తిరుగు ప్రయాణమై వెళ్తున్న వారికి దాదాపు 5 వేల నుంచి 6 వేల మందికి గత పది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని భక్తులు తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన పురస్కరించుకొని కులమతాలకతీతంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్సై సునీల్ కుమార్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ఏంటి

విశాలాంధ్ర - పెద్దకడబూరు: ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం ఏమిటని సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయలు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సిపిఐ వివిధ సమస్యలపై పోరాటాలు చేస్తుందన్నారు. ప్రజల పక్షం నిలబడి సమస్యలపై అధికారులను నిలదీస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం పొజిషన్ పట్టాలో ఉన్న 4 సెంట్లు స్థలాన్ని రద్దు చేసి 1.5 సెంట్లు మంజూరు చేసిందన్నారు. ఆ స్థలానికి హద్దులను చూపమని రెవెన్యూ అధికారులకు నాలుగు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దకడబూరు గ్రామానికి చెందిన తిక్కమ్మ సమస్యను త్వరగా పరిష్కారం చేయాలని కోరామని, తహసీల్దార్ గీతా ప్రియదర్శిని బాధితులను, సిపిఐ నాయకులను ఇది పెద్ద సమస్య కాదని, పొజిషన్ సర్టిఫికెట్ అని ఆఫీసు నుంచి బయటకు వెళ్లమని దుర్భాషలాడుతూ మహిళను తన సిబ్బందితో నెట్టివేసిందన్నారు. దీంతో ఈ విషయంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అనడంతో

పోలీసు స్టేషన్‌లో సిపిఐ నాయకులు వీరేష్‌పై కేసు పెట్టారని తెలిపారు. ప్రజా వేదికలో వచ్చిన అర్జీలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న తహశీల్దార్ గీతా ప్రియదర్శినిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిక్కన్న, నర్సింహులు, తిక్కమ్మ, రవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన : ఫ్యాప్టో

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ ముందు ఏప్రిల్ 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు నిరసన కార్యక్రమం నిర్వహించాలని పిలుపు నిచ్చారు. సోమవారం ఎస్‌టియు భవన్ యందు రాష్ట్ర మరియు జిల్లా స్థాయి నాయకుల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ఫ్యాప్టో రాష్ట్ర కోఛైర్మన్ కె.ప్రకాష్‌రావు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు జి.హృదయరాజు హాజరయ్యారు. సమావేశంలో కర్నూలు జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ సేవలాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సందర్భంగా రాష్ట్ర కోఛైర్మన్ కాకి ప్రకాష్ రావు మాట్లాడుతూ కరోనా కాలం నుండి మరణించిన ఉపాధ్యాయ ఉద్యోగుల పిల్లలకు ఇవ్వాల్సిన కారుణ్య నియామకాలు చేపట్టాలని ఫ్యాప్టో డిమాండ్ చేస్తుందన్నారు. కారుణ్య నియామకాలు కొరకు ఎదురు చూస్తున్న వాళ్ళు కూడా నిరసన కార్యక్రమంలో పాల్గొనవలెనని, పిఆర్‌సి కమిటీ వేసి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కార్య నిర్వాహక సభ్యుడు జి.హృదయ రాజు మాట్లాడుతూ డిఎ బకాయిలు చాల ఉన్నాయి, వాటిని వెంటనే ప్రకటించాలని, సరెండర్ లీవ్ బకాయిలు 2022 నుండి పెండింగ్‌లో వున్నాయి. కొన్ని బకాయిలు ఈ నెలలో చెల్లించిన చాల వరకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చెల్లించటానికి రోడ్ మ్యాప్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ భాస్కర్ గారు మాట్లాడుతూ ఫ్యాప్టో నిర్ణయించిన కార్యక్రమం విజయవంతం చేసీ ప్రభుత్వం నకు ఉపాధ్యాయ మరియు ఉద్యోగుల కోరికను తెలియచెప్పాల్సిన అవసరం ఉంది అన్నారు. ఈ సమావేశం యందుజిల్లా ఫ్యాప్టో ఆర్థిక కార్యదర్శి రంగన్న, రవి కుమార్, నవీన్ పాటిల్, గోకారి, జనార్ధన్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట రాముడు, నందీశ్వరుడు సమావేశంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో 51 కరువు ప్రభావిత మండలాల ప్రకటన

- జిల్లాలో 9 కరువు మండలాలు, మరొకటి మితమైన కరువు మండలంగా ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్ర వ్యాప్తంగా 6 జిల్లాల్లో 51 కరువు ప్రభావిత మండలాలు గుర్తించామని రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిర్వహించిన కరువు ప్రభావ కమిటీ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కమిటీ నిశితంగా పరిశీలించింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను తాము దృష్టిలో ఉంచుకుని, వర్షపాతం లోటు, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. 37 మండలాల్లో తీవ్రమైన కరువు, 14 మండలాల్లో మితమైన కరువు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. కర్నూలు జిల్లాలో ఆస్పరి, కర్నూలు రూరల్ , కర్నూలు అర్బన్, కల్లూరు, ఓర్వకల్లు, కోడుమూరు, గూడూరు, వెల్దుర్తి, మద్దికెర మండలాలను తీవ్ర కరువు మండలాలుగా, పత్తికొండను మితమైన కరువు మండలంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.కరువు ప్రాంతంలో రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం వేసవి తీవ్రతను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తోందని, అవసరమైన నిధులు, సబ్సిడీలు, సహాయక కార్యక్రమాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

కొత్త వ్యవసాయ పనులకు భూమి పూజ

విశాలాంధ్ర - హొళగుంద: విశ్వావసు ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని రైతులందరూ కొత్త వ్యవసాయ పనులకు భూమి పూజ చేశారు. పొలాల్లో భూమి పూజ చేసి గుంటుక తోలారు. చెట్లను, ముళ్ళ కంపులను నరికి వేశారు. ట్రాక్టర్ ద్వారా నల్లరేగడి భూమిలో రైతులు మడకను దున్నారు. రైతులు ఎద్దులను అలంకరించి గ్రామాల్లో ఊరేగిస్తూ తమ పొలాల వరకు తీసుకువెళ్లారు. భూదేవికి రైతులు అన్న సంతర్పణ సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటల దిగుబడి ఆశాజనకంగా రావాలని పంటకు మద్దతు ధర లభించాలంటూ ప్రార్థించామన్నారు. వర్షం సకాలంలో కురిసి వాగులు ,వంకలు వరద నీటితో పొంగి ప్రవహించాలని అన్నారు. దేవాలయాల్లో రైతులు ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

తుంగభద్ర నుండి 5 క్యూసెక్కుల నీరు విడుదల

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలనే ఉద్దేశ్యంతో ముందుచూపుగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిలతో పాటు మంత్రాలయం టీడీపీనాయకులు రాఘవేంద్రరెడ్డిలు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో తుంగభద్ర నుండి అదివారం 5 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ నీరు తుంగభద్ర పరివాహ ప్రాంతాలలలో వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరపడుతుందని అధికారులు తెలియచేస్తున్నారు.తుంగభద్ర నుండి విడుదల చేసిన నీరు సుంకేసులకు 0.600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరే అవకాశం ఉంది.దీంతో కర్నూలు పట్టణంకు వేసవిలో నీటి ఇబ్బందులను ఉపశమనం కలిగినట్లు అయింది. వేసవిలో కర్నూలు నగరానికి నీటి ఇబ్బందులు ఉండవని అధికారులు తెలియచేస్తున్నారు.

రేపు ఎమ్మెల్సీగా బీటీ నాయుడు ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఈ నెల 2న రెండోసారి ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. కర్నూలు జిల్లా కోసిగికి చెందిన బీటీ నాయుడు ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బీటీ నాయుడుకు మరోమారు అవకాశం కల్పించడంతో ఏప్రిల్ 2వ తేదిన వెలగపూడి అమరావతి అసెంబ్లీ హాల్ నందు మధ్యాహ్నం 1గం ప్రమాణస్వీకారం చేయనున్నారు. శాసనమండలి చైర్మెన్ మోజేస్ ఆయన చేత ప్రమాణస్వీకారం చేపించనున్నారు. బీటీ నాయుడు టీడీపీ అభ్యర్థిగా 2014, 2019 కర్నూలుఎంపీగా పోటీ చేసి ఓటమి పాలైనారు. 2014 టీడీపీ అధికారంలో ఉండగా ఆయన వాల్మీకి కార్పొరేషన్ చైర్మెన్‌గా పనిచేశారు. ఆసమయంలోనే చంద్రబాబునాయుడు బీటీ నాయుడుకు ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. మార్చి నెలలో ఆయన పదవి కాలం పూర్తి కావడంతో మరోమారు టీడీపీ అధినేత ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంతో ఆయన రెండోసారి ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

పోటీ విజేతలకు నగదు బహుమతులు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి. మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వెలసిన ఎర్రితాత ఒకటవ ఆరాధన మహోత్సవం సందర్భంగా గ్రామంలో బండలాగుడు పోటీలను గ్రామ సర్పంచ్ భర్త బాలమిన్నెల, గ్రామ నాయకుడు వీరభద్రుడు ఆలయ పూజారి ధనుంజయ తదితరులు సోమవారం ప్రారంభించారు. ఈ పోటీలో పాలపళ్ళు వృషభలు 12 జతల ఎద్దులు పాల్గొని హెరాహోరీగా తలపడి గెలుపొందిన వృషభ విజేతలకు గ్రామనికి చెందిన దాతలు నగదును మొదటి బహుమతిగా నంద్యాల జిల్లా, సంజామల మండలం, ఆకుమల్ల గ్రామం నాగజ్యోతి వృషభలు 20వేలు, రెండవ బహుమతిగా నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం వెంగళంపల్లె దర్శిత వృషభలు రూ.15 వేలు, మూడో బహుమతిగా నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం, పెద్ద పూజల గ్రామ వృషభల రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.7 వేలు, ఐదవ బహుమతి రూ.5 వేలు, ఆరో బహుమతి రూ.4 వేలు, ఏడవ బహుమతి రూ.3,500 గ్రామ పెద్దలు వృషభయజమానులకు అందజేశారు. రెండు రోజులపాటు జరిగిన ఎర్రితాత ఆరాధన మహోత్సవంలో ప్రభను గ్రామ పురవీధులలో ఊరేగించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 01, ఏప్రిల్ 2025

నగర ప్రజల సహకారానికి కృతజ్ఞతలు

- రూ.71.47 కోట్లు దాటిన ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు
- ఈ స్థాయిలో వసూలు చేయడం ఇదే తొలిసారి
- నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, ఆర్వో ఇశ్రాయేలు

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : నగరాభివృద్ధికి పన్నులు చెల్లించి సహకరించాలనే నగరపాలక సంస్థ పిలుపునకు స్పందించి, అత్యధిక సంఖ్యలో బకాయిదారులు పన్నులు చెల్లించి సహకరించిన బకాయిదారులందరికీ నగరపాలక మేనేజర్ ఎస్.చిన్నరాముడు, ఆర్వో ఇశ్రాయేలు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం వారు నగరపాలక కార్యాలయంలోని పన్ను వసూలు కేంద్రంతోపాటు, సి.క్యాంపు, బాలాజీ నగర్, కల్లూరు వార్డు కార్యాలయంలో ఉన్న ప్రత్యేక కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజర్, ఆర్వో మాట్లాడుతూ గతంలో ఎప్పుడు లేనంతగా రూ.71.47 కోట్లు ఆస్తి ఖాళీ స్థలఖు పన్నులు వసూలు అవ్వడం నగరపాలక యంత్రాంగానికి సరికొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు. తాగునీటి కొళాయి చార్జీలు రూ.7.76 కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు.

వైభవంగా శ్రీ వల్లేలాంబాదేవి రథోత్సవం

విశాలాంధ్ర - కోడుమూరు: పట్టణ శివారులోని హంద్రీ నది ఒడ్డున వెలసిన శ్రీ వల్లెలాంభదేవి అమ్మవారి రథోత్సవ వేడుకలను ఆదివారం సాయంత్రం భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 29 నుంచి ప్రారంభమైన ఉగాది ఉత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీ వల్లెలాంబ దేవి అమ్మవారి రథోత్సవం వేడుకలు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పూలాలంకరణలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం పట్టణంలోని ఆయా వీధిలలో నుంచి భక్తులు మేళతాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాయంత్రం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువు తీర్చి ప్రత్యేక పూజలు చేసి మహా మంగళహారతిచ్చి భక్తుల జేజేల నడుమ రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు అమ్మవారికి జేజేలు పలుకుతూ రథాన్ని ఆలయం వద్ద నుంచి ఎదురు మంటపం వరకు లాగి తిరిగి ఆలయం వద్దకు చేర్చారు. రథోత్సవ వేడుకలను తిలకించేందుకు పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కాయా కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవ కార్యక్రమం సందర్భంగా ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు జడ్పిటిసి రఘునాథరెడ్డి, కృష్ణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్, గుంతకంటి మల్లారెడ్డి, పూల వాసు,కెవిఆర్ రవిబాబు, శాలప్ప, కండక్టర్ మిరపకాయల నాగరాజు, వార్డు సభ్యులు ఆకుల రవి, విష్ణు దాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 51 కరువు ప్రభావిత మండలాల ప్రకటన

- జిల్లాలో 9 కరువు మండలాలు, మరొకటి మితమైన కరువు మండలంగా ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్ర వ్యాప్తంగా 6 జిల్లాల్లో 51 కరువు ప్రభావిత మండలాలు గుర్తించామని రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిర్వహించిన కరువు ప్రభావ కమిటీ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కమిటీ నిశితంగా పరిశీలించింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను తాము దృష్టిలో ఉంచుకుని, వర్షపాతం లోటు, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. 37 మండలాల్లో తీవ్రమైన కరువు, 14 మండలాల్లో మితమైన కరువు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. కర్నూలు జిల్లాలో ఆస్పరి, కర్నూలు రూరల్ , కర్నూలు అర్బన్, కల్లూరు, ఓర్వకల్లు, కోడుమూరు, గూడూరు, వెల్దుర్తి, మద్దికెర మండలాలను తీవ్ర కరువు మండలాలుగా, పత్తికొండను మితమైన కరువు మండలంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.కరువు ప్రాంతంలో రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం వేసవి తీవ్రతను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తోందని, అవసరమైన నిధులు, సబ్సిడీలు, సహాయక కార్యక్రమాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

కొత్త వ్యవసాయ పనులకు భూమి పూజ

విశాలాంధ్ర - హొళగుంద: విశ్వావసు ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని రైతులందరూ కొత్త వ్యవసాయ పనులకు భూమి పూజ చేశారు. పొలాల్లో భూమి పూజ చేసి గుంటుక తోలారు. చెట్లను, ముళ్ళ కంపులను నరికి వేశారు. ట్రాక్టర్ ద్వారా నల్లరేగడి భూమిలో రైతులు మడకను దున్నారు. రైతులు ఎద్దులను అలంకరించి గ్రామాల్లో ఊరేగిస్తూ తమ పొలాల వరకు తీసుకువెళ్లారు. భూదేవికి రైతులు అన్న సంతర్పణ సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటల దిగుబడి ఆశాజనకంగా రావాలని పంటకు మద్దతు ధర లభించాలంటూ ప్రార్థించామన్నారు. వర్షం సకాలంలో కురిసి వాగులు ,వంకలు వరద నీటితో పొంగి ప్రవహించాలని అన్నారు. దేవాలయాల్లో రైతులు ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

పూర్ణాహుతితో ముగిసిన మహోత్సవాలు

విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైలం మహా క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు పూర్ణాహుతితో సోమవారం ముగిశాయి. సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అనంతరం యాగశాలలో పూర్ణాహుతి ద్రవ్యాలను యజ్ఞగుండంలో ఆహుతిగా సమర్పించి, పూర్ణాహుతి కార్యక్రమాలను అర్చక స్వాములు శాస్త్రాను సారంగా నిర్వహించారు. అనంతరం చండీశ్వరునికి ప్రత్యేక పూజలు పుష్కరంలో అవబృదము త్రిశూల స్థానం కార్యక్రమంలో అర్చక స్వాములు నిర్వహించారు. సాయంకాలం ప్రత్యేక పూజలతో ఉగాది మహోత్సవాలు పూర్తిగా ముగిశాయి.

రమణీయం శ్రీ గిడ్డాంజనేయస్వామి రథోత్సవం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని తారపురం గ్రామంలో వెలిసిన శ్రీ గిడ్డాంజనేయస్వామి రథోత్సవం ఆలయ కార్యనిర్వహణాధికారి సాయి కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అశేష భక్తవాహిణి నడుమ రమణీయంగా జరిగింది. ఆలయ అర్చకులు అనుమేష్ స్వామి, నాగరాజు స్వామి, బసవరాజు స్వామి, గిరీష్ స్వామి స్వామివారికి జలాభిషేకం, ఆకు పూజ, కుంకుమార్చన, బిల్వర్చన, పంచామృతా భిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి రథాన్ని పుష్పాలంకరణతో సుందరంగా అలంకరించారు. శ్రీ గిడ్డాంజనేయస్వామి రథానికి అలంకరించేందుకు గజమాలలను గ్రామ పెద్ద భరత్ కుమార్ కౌశిక్ ఇంటి నుండి ఊరేగింపుగా తెచ్చారు. స్వామి వారి పూర్ణకుంభం పెద్ద వీరారెడ్డి ఇంటి నుండి బయటకు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా రథం వద్దకు తెచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తిని ఆలయం నుండి అత్యంత భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం అశేష భక్తవాహిణి నడుమ శ్రీ గిడ్డాంజనేయస్వామి రథోత్సవం కన్నుల పండుగగా జరిగింది.

శ్రీ గిడ్డాంజనేయస్వామి పలువురు ప్రత్యేక పూజలు : స్వామివారి రథోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ గిడ్డాంజనేయస్వామి కింద మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్రరెడ్డి సోదరులు టీడీపీ యువనేత రామకృష్ణారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ నేతలు రాజారెడ్డి, మల్లికార్జున, వీరేష్ గౌడ్, మీ సేవ ఆంజనేయులు, గోనుమాను నరసన్న ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, గ్రామ సర్పంచ్ లక్ష్మీ, వైసీపీ నాయకులు జాము మూకయ్య, శ్రీ గిడ్డాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోసిగి సీఐ మంజునాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐలు నిరంజన్ రెడ్డి, హనుమంతరెడ్డి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి సాయి కుమార్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్త వసంత కుమార్ కౌశిక్, వైసీపీ నాయకులు బజారి, రామిరెడ్డి, టీడీపీ నాయకులు డీలర్ నరసప్ప, మహదేవ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసిన మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాలలోని వేలాది నిరుపేద ముస్లిం కుటుం బాలకు రంజాన్ తోఫా కిట్లను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పంపిణీ చేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని, నంద్యాల నియోజక వర్గంలోని వేలాది నిరుపేద ముస్లిం కుటుంబాలకు స్థానిక టీడీపీ కార్యా లయం రాజ్ టాకీస్ నందు మంత్రి తన సొంత నిధులతో తోఫా కిట్లను అందజేసి, మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. గోస్పాడు, నంద్యాల పరిధిలోని ముస్లిం కుటుంబాలకు తోఫాను అందజేశారు.

కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది: మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణ ముస్లిం మైనార్టీ సోదరులు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఇందిరా రెడ్డి దంపతులను, మాజీ సర్పంచ్ బీసీ రాజా రెడ్డి, బీసీ రామనాథరెడ్డిని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీ సోదరులకు ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నియోజవర్గ అధ్యక్షుడు రాయలసీమ సలాం, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, పట్టణ అధ్యక్షుడు కాశీం బాబు, వార్డు మెంబర్లు అత్తర్ కలాం, అల్తాఫ్, నియాజ్, షాకీర్, అల్లా ప్రకాష్ ముస్లిం మైనార్టీ సోదరులు పెద్ద సంఖ్య పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి పూజలు

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : తెలుగు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా శ్రీ అభయ ఆంజనేయ స్వామికి శ్రీ సీతారామచంద్రమూర్తికి అభిషేకం అలంకరణ పంచామృత అభిషేకం కుంకుమ సింధూర అర్చనలు ఆకు పూజలు జరిగాయి. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి ప్రసాద వితరణ చేయడం జరిగింది. జంబులదిన్నె గ్రామ భక్తులు, చుట్టుప్రక్కల గ్రామాల సుద్ద పల్లె, పెద్దముడియం, బలపన గూడూరు, పెద్దయమ్మనూరు నుండి కూడా భక్తులు వచ్చి స్వామి వారి దర్శనం చేసుకుని అర్చనలు అభిషేకాలు పూజలు చేయించుకుని వెళ్ళడం జరిగింది. ఆలయ అర్చకులు మీ కీర్తి లక్ష్మణ స్వామి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని భగవంతుని ప్రార్థించడం జరిగింది.

ఏపీలో రిజిస్ట్రేషన్ శాఖలో కీలక మార్పులు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వము, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ, కర్నూలు వారి ఉత్తర్వుల మేరకు ఈ నెల రెండో తేదీ నుండి నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యలయం నందు దస్తావేజు స్వీకరణ కొరకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన స్లాట్ బుకింగ్ ద్వారా ఇక నుంచి రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిరీక్షించే అవసరం లేకుండా ముందుస్తుగా స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనుందని నంద్యాల సబ్ రిజిస్ట్రార్ తెలిపారు. మొన్నటి వరకు భూముల రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే గంటల తరబడి వెయిటింగ్ చేయాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడు వెయిటింగ్ చేయకుండా రిజిస్ట్రేషన్ సమయానికి వెళ్తే సరిపోతుంది.

భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ వేడుకలు

విశాలాంధ్ర - ఓర్వకల్లు: సోమవారం ఓర్వకల్లు, నన్నూరు, లొద్దిపల్లె, పుడిచేరళ్ళ, హుసేనాపురం తదితర రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఓర్వకల్లులో రచ్చకట్ట వద్ద ఉన్న జామియా మసీద్ నుంచి ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ముస్లింలందరూ కలిసి చేతికి నల్ల బ్యాడ్జీలను ధరించి శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేసి ఈద్గా వద్దకు చేరుకొని ప్రవక్త మహమ్మద్ సోల్లల్లాహు అలైహి వసల్లం సందేశాలను మౌలానా తెలిపారు. అనంతరం మౌలానా మాట్లాడుతూ నెలరోజుల పాటు ఉపవాసాలు, ఐదు పూటల నమాజు తరావి ఆచరిస్తూ మనం చేసిన పాపాలను తొలగించాలని ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ప్రవక్తను వేడుకోవడం జరిగింది. ప్రతి ఒక్కరు ఐక్య భావంతో ఉండి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రవక్త మహమ్మద్ సోల్లల్లాహు అలైహి వసల్లం ఆచారాలను ప్రతి ఒక్క ముస్లిం సోదరులు పాటించాలని తెలిపారు. మైనారిటీల హక్కులకు ముప్పుగా భావించే వక్ఫ్ బోర్డు బిల్లుకు ప్రతిపాదిత సవరణలకు వ్యతిరేకంగా నిరసన చేపడుతున్నామని తెలియజేశారు. ఈ నిర్ణయాన్ని పునరపరిశీలించి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో షేరఖాన్ షాంశుద్దీన్ ఖాజామియ్య హుసేన్ సర్కార్ మొల్ల గౌస్, మొల్ల ఇబ్రహీం,బషీర్ మియా, అయూబ్, ఇంతియాజ్, హుస్సేన్, తదితర ముస్లింసోదరులు పాల్గొన్నారు.

బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాల ప్రారంభం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: పట్టణంలోని ముఖ్య కూడళ్లలో బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన చలివేంద్రాలను వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టా రేణుక భర్త, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బుట్టా శివ నీలకంఠ మాట్లాడుతూ, వేసవి కాలం ప్రారంభమై తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఈ కఠిన పరిస్థితుల్లో ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చడమే తమ ముఖ్య లక్ష్యమన్నారు. ఎండలు పెరుగుతున్న కొద్దీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి వీరుపాక్షి రెడ్డి, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి మాచాని వెంకటేష్, చేనేత జిల్లా అధ్యక్షులు ఎం.కె. శివ ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యు.కె. రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి కదిరికోట సునీల్ కుమార్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు డి.నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన ఉగాది సంబరాలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబళం, కల్లుకుంట, హెచ్ మురవణి, బసలదొడ్డి, నౌలేకల్, దొడ్డిమేకల తదితర గ్రామాల్లో సోమవారం ఉగాది సంబరాలు అంబరాన్ని అంటాయి. పెద్దకడబూరులో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, వైసీపీ యువజన విభాగం తాలూకా అధ్యక్షులు నరవ రాజశేఖర్ రెడ్డి, టీడీపీ టౌన్ అధ్యక్షులు మల్లికార్జున, రేయిన్ బో ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గోవిందరెడ్డి, సొసైటీ ఈసీఓ మురళీధర్ రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే తాలూకా సహాయ కార్యదర్శి బొగ్గుల ఈరన్న, తాలూకా ఉపాధ్యక్షులు జె.పుల్లయ్య , మండల అధ్యక్షులు బొగ్గుల సోమన్న, మండల కమిటీ సభ్యులు రాజు మరియు యువకులు ఉగాది సంబరాల్లో పాల్గొని ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి చెప్పారు. గ్రామ పురవీధుల గుండా కుల మతాలకు అతీతంగా ఉగాది సంబరాల్లో భాగంగా రంగులు చల్లుకొని సోదర భావాన్ని చాటారు. ఉగాది తెలుగు నామ సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

మహిళలకు చీరలు పంపిణీ చేసిన నాయకులు

విశాలాంధ్ర - నందికొట్కూరు: వైసీపీ రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాలతో నందికొట్కూరు పట్టణంలోని మారుతి నగర్‌లో 50 మంది ముస్లిం, మైనారిటీ మహిళలకు సోమవారం మారుతి నగర్ వైఎస్ఆర్సిపి నాయకులు చరణ్ తేజ్ చీరలు పంపిణీ చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో పవిత్రమైన రంజాన్ పర్వదిన సందర్భంగా ముస్లిం సహోదర సహోదరీలు అందరూ కూడా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ అల్లాహ్ ఆశీర్వాదాలు ఎల్లప్పుడు తోడుగా ఉండాలని కోరుకుంటూ 50 మంది ముస్లిం మరియు మైనార్టీ మహిళలకు చీరల పంపిణీ చేయడం ఆ దేవుని కృపవలన జరిగిందని చరణ్ తేజ అన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి నగర్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, పెయింటర్ మహబూబ్ బాష, బాబు, ప్రకాశం, రెహమాన్, శశాంక్, అరుణ్, రియాజ్, లాజర్, ముస్లిం, మైనారిటీ మహిళలు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర స్వామికి పల్లకి సేవ

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని యాగంటి శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారం సందర్భముగా ఉమా మహేశ్వర స్వామికి పల్లకి సేవ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం నందు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేష్ రెడ్డి, యాగంటిపల్లె ఉప ఉప సర్పంచ్ మౌళీశ్వర రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డలో రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులు ఫిత్రా, జకాత్ ను ఆచరించి ప్రార్థనలకు వెళ్లారు. పట్టణంలోని మసీదులు, దివ్య జ్ఞాన మందిరం నుంచి ముస్లింలు తక్బీర్ చదువుకుంటూ లింగందిన్నె రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీ, మత పెద్ద మహమ్మద్ సాదిక్ రంజాన్ పండుగ గొప్పతనాన్ని వివరించారు.

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : ముస్లింలు రంజాన్ పర్వదినం వేడుకలను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించు కున్నారు. రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు ఉపవాస దీక్షల అనంతరం వచ్చే రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంతోపాటు, రేవనూరు, అమదాల, సౌదర దిన్నె, పెద్ద కొప్పెర్ల, చిన్నకొప్పెర్ల, కలుగోట్ల తదితరు గ్రామాల్లో ప్రజలు ఈద్‌గాలకు వెళ్లి ప్రార్థన నిర్వహించారు.

ఎమ్మెల్యేకు ఈద్ ముబారక్ తెలిపిన షబానా

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: రంజాన్ పర్వ దినాన్ని పురస్కరించుకొని ఆత్మకూరు పట్టణంలో ముస్లీంలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే వేడుకల్లో శ్రీశైలం నియో జకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొ న్నారు. నమాజ్ అనంతరం బీజేపీ నాయకురాలు మోమిన్ షబానా ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లీంల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

తుంగభద్ర నుండి 5 క్యూసెక్కుల నీరు విడుదల

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలనే ఉద్దేశ్యంతో ముందుచూపుగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిలతో పాటు మంత్రాలయం టీడీపీనాయకులు రాఘవేంద్రరెడ్డిలు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో తుంగభద్ర నుండి అదివారం 5 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ నీరు తుంగభద్ర పరివాహ ప్రాంతాలలలో వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరపడుతుందని అధికారులు తెలియచేస్తున్నారు.తుంగభద్ర నుండి విడుదల చేసిన నీరు సుంకేసులకు 0.600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరే అవకాశం ఉంది.దీంతో కర్నూలు పట్టణంకు వేసవిలో నీటి ఇబ్బందులను ఉపశమనం కలిగినట్లు అయింది. వేసవిలో కర్నూలు నగరానికి నీటి ఇబ్బందులు ఉండవని అధికారులు తెలియచేస్తున్నారు.

రేపు ఎమ్మెల్సీగా బీటీ నాయుడు ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఈ నెల 2న రెండోసారి ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. కర్నూలు జిల్లా కోసిగికి చెందిన బీటీ నాయుడు ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బీటీ నాయుడుకు మరోమారు అవకాశం కల్పించడంతో ఏప్రిల్ 2వ తేదిన వెలగపూడి అమరావతి అసెంబ్లీ హాల్ నందు మద్యాహ్నం 1గం ప్రమాణస్వీకారం చేయనున్నారు. శాసనమండలి చైర్మెన్ మోజేస్ ఆయన చేత ప్రమాణస్వీకారం చేపించనున్నారు. బీటీ నాయుడు టీడీపీ అభ్యర్థిగా 2014, 2019 కర్నూలుఎంపీగా పోటీ చేసి ఓటమి పాలైనారు. మార్చి నెలలో ఆయన పదవి కాలం పూర్తి కావడంతో మరోమారు టీడీపీ అధినేత ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంతో ఆయన రెండోసారి ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

పోటీ విజేతలకు నగదు బహుమతులు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి. మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వెలసిన ఎర్రితాత ఒకటవ ఆరాధన మహోత్సవం సందర్భంగా గ్రామంలో బండలాగుడు పోటీలను గ్రామ సర్పంచ్ భర్త బాలమిన్నెల, గ్రామ నాయకుడు వీరభద్రుడు ఆలయ పూజారి ధనుంజయ తదితరులు సోమవారం ప్రారంభించారు. ఈ పోటీలో పాలపళ్ళు వృషభలు 12 జతల ఎద్దులు పాల్గొని హెూరా హెూరీగా తలపడి గెలుపొందిన వృషభ విజేతలకు గ్రామనికి చెందిన దాతలు నగదును మొదటి బహుమతిగా నంద్యాల జిల్లా, సంజామల మండలం, ఆకుమల్ల గ్రామం నాగజ్యోతి వృషభలు 20వేలు, రెండవ బహుమతిగా నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం వెంగళంపల్లె దర్శిత వృషభలు రూ.15 వేలు, మూడో బహుమతిగా నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం, పెద్ద పూజల గ్రామ వృషభల రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.7 వేలు, ఐదవ బహుమతి రూ.5 వేలు, ఆరో బహుమతి రూ.4 వేలు, ఏడవ బహుమతి రూ.3,500 గ్రామ పెద్దలు వృషభయజమానులకు అందజేశారు. రెండు రోజులపాటు జరిగిన ఎర్రితాత ఆరాధన మహోత్సవంలో ప్రభను గ్రామ పురవీధులలో ఊరేగించారు.

ముస్లీం సోదరులకు రంజాన్ తెలిపిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ముస్లిం సోదరులు నెలరోజుల పాటు ఉపవాస ప్రార్థనలు చేపట్టి ఘనంగా రంజాన్ పండుగను నిర్వహించడం జరిగింది. కొత్తపేట మసీదులో ప్రార్థనలో నిర్వహించుకుని, కబురస్థాన్లో తమ పెద్దలను స్మరించుకుంటారు. పట్టణంలో నంద్యాల టర్నింగ్ లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ముస్లిం సోదరులను కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజెశారు. ముస్లిం సోదరులందరూ ఒకరిని ఒకరు అలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వీరి వెంట టిడిపి నాయకులు యుగంధర్ రెడ్డి, అబ్దుల్లాపురం భాష, శాలి పైల్వాన్, నూరుబేగ్, ముస్లిం మైనార్టీ సోదరులు, మత పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలంధ్ర- జూపాడు బంగ్లా: రంజాన్ పండుగ పురస్కరించు కొని ముస్లిం సోదరులు కుటుంబ సమేతంగా భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలం లోని తరిగొప్పుల, జూపాడు బంగ్లా, తుడిచెర్ల, పోతులపాడు, పారు మంచాల, తాటిపాడు, తంగడంచ, తత్తూరు, మల్లెం, బన్నూరు గ్రామాలలో ఈద్ అల్ ఫిథర్ పర్వదినం రంజాన్ పండుగ సందర్భంగా మసీదులు దర్గాలలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థన చేశారు.

కుల వృత్తుల వారిని విశ్వకర్మ పథకంలో చేర్చాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: స్థానిక బీజేపీ కార్యాల యంలో అసెంబ్లీ కన్వీనర్ బివి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ బివి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు సాధించిన ఘన విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి గ్రామంలో అంత్యోదయ కార్యకర్తలను కుల వృత్తుల వారీగా ఉన్నటువంటి అందరిని విశ్వకర్మ పథకంలో చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాదగిరి ఇతర మండల అధ్యక్షులు పాల్గొన్నారు.